జైలు నుంచి దర్శన్ విడుదల
● బెయిల్ రాకతో అభిమానుల్లో ఆనందం
7

నేడే దీపావళి

● రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలకు సిద్ధం
● రాత్రి10 గంటల వరకే బాణసంచాకు అనుమతి
● బెంగళూరు సహా అన్ని జిల్లాల్లోనూ నిబంధనలు





బెంగళూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దీపపు కాంతులతో ఇంటింటా వెలుగులు నింపే దీపావళి వేడుకలకు అంతా సిద్ధమయ్యింది. రాష్ట్రమంతటా పండగ సందడి నెలకొంది. వారాంతం కూడా కలసి వస్తుండడంతో ఈ ఏడాది దీపావళి నాలుగు రోజుల పండుగగా మారింది. దీపావళి పండుగను వెలుగులు చిమ్మే వేడుకగా జరుపుకొనే సంప్రదాయం ఉంది. సంప్రదాయంగా లక్ష్మీపూజ చేయడం ఆనవాయితీ. పండుగవేళ నరకచతుర్థశి, దీపావళి, బలిపాడ్యమిల పేరిట వేడుకలు చేసుకుంటారు.

పర్యావరణానికి భంగం కలగకుండా గ్రీన్ టపాసులు మాత్రమే కాల్చాలని ప్రభుత్వం ఆదేశించినా పెద్దగా ఫలితం లేదనిపిస్తోంది. ప్రతిచోటా సాధారణ టపాసులే హల్‌చల్ చేస్తున్నాయి. గ్రీన్ టపాసుల ధర ఎక్కువగా ఉండడంతో సాధారణమైన టపాసులు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. రాష్ట్రమంతటా పండుగకోసం భారీగా బాణాసంచా సిద్ధం చేశారు. బెంగళూరుకు చెందిన వేలాది మంది సరిహద్దులోని అత్తిబెలెవైపు వెళ్లారు. అత్తిబెలె నుంచి హోసూరు దాకా జాతీయరహదారికి ఇరువైపులా వందలాది బాణాసంచా దుకాణాలు వెలిశాయి. బెంగళూరు ప్రజలే కాకుండా సమీప జిల్లాలు కోలారు, తుమకూరు, చిత్రదుర్గతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని సమీపప్రాంతాల వాసులు బాణాసంచా కొనుగోలుకు అత్తిబెలెవైపు తరలివచ్చారు.

టపాసులు కాల్చేవేళ సురక్షితమైన జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక, వైద్యనిపుణులు సూచిస్తున్నారు. లైసెన్స్ పొందిన దుకాణాల నుంచి మాత్రమే టపాసులు కొనుగోలు చేయాలని, భారీ శబ్దాలు వచ్చే టపాసులు కాల్చరాదని, టపాసు కాల్చే సమయంలో పిల్లలను దూరంగా ఉంచాలని సూచిస్తున్నారు. మరోవైపు పిల్లలు టపాసులు కాలుస్తున్న వేళ పెద్దలు పర్యవేక్షించాలని, మూగ ప్రాణులకు ఇబ్బంది కలగకుండా టపాసులు కాల్చాలని సూచిస్తున్నారు. సింథటిక్, నైలాన్, పాలిస్టర్ దుస్తులు ధరించరాదని, చేతులకు గ్లవ్స్‌తోపాటు కళ్లకు సురక్షితంగా కళ్లజోడు ధరించాలని వైద్యనిపుణులు అభిప్రాయపడ్డారు. చేతిలో టపాసులు పట్టుకుని కాల్చరాదన్నారు. చిన్నపిల్లలచేత భారీ శబ్దం వచ్చే టపాసులు కాల్చరాదని నిపుణులు సూచిస్తున్నారు. రాష్ట్రంలోని అన్నిప్రాంతాలలోనూ టపాసుల విక్రయాలకు అనుమతులు ఇచ్చారు. బెంగళూరులో 351 దుకాణాలకు అనుమతులు ఇవ్వగా, మైసూరు, మంగళూరు, బెళగావి, హుబ్బళ్ళి ధారవాడతోపాటు అన్ని ప్రధాన నగరాలలోనూ మైదానాలలో మాత్రమే విక్రయించేలా చర్యలు చేపట్టారు. ప్రతిచోటా సురక్షితమైన చర్యలు తప్పనిసరి చేశారు. కాగా టపాసులు ఇష్టారాజ్యంగా రవాణా చేయకుండా కట్టడి చేసేందుకు పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ప్రత్యేకించి బెంగళూరు నగర శివారులోని అత్తిబెలె ప్రాంతం నుంచి టపాసుల కొనుగోలుకు వేలాదిమంది వెళ్తుండడంతో ప్రతిబస్సులోనూ సోదాలు చేస్తున్నారు. మరోవైపు రైల్వే స్టేషన్‌లలో తనిఖీలు కొనసాగిస్తున్నారు.

ఆసుపత్రుల్లో అత్యవసర విభాగాలు

బెంగళూరులో మింటోతోపాటు పలు ఆసుపత్రులలో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. టపాసులు కాల్చేవేళ ప్రమాదం జరిగితే వెంటనే ఆసుపత్రులలో చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విక్టోరియాకు అనుబంధంగా ఉండే మింటో ఆసుపత్రిలో రెండురోజుల క్రితమే ప్రత్యేక వార్డులు సిద్ధం చేశారు. అదే తరహాలో అగర్వాల్ కంటి ఆసుపత్రి, నారాయణ నేత్రాలయలు టపాసుల ప్రమాద బాధితుల కోసం అత్యవసర విభాగాలు ఏర్పాటు చేశారు.

రంగంలోకి టాస్క్‌ఫోర్స్

టపాసులు పేల్చడం ద్వారా ఇతరులకు అంతరాయం ఉండరాదని ప్రభుత్వం భావించింది. అందుకు అనుగుణంగా గురువారం నుంచి శనివారం దాకా రాత్రి 8 గంటల నుంచి 10వరకు మాత్రమే టపాసులు కాల్చాలని సూచించారు. అంతకుమించి టపాసులు కాలిస్తే చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నియమితులయ్యారు. వారు నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ సంచరించనున్నారు.

ప్రతిచోటా మట్టి దీపాలు

దీపావళి పండుగ అంటే ఇంటి ముంగిట దీపాలు వెలిగించే సంప్రదాయం ఉంది. మట్టితో దీపాలు, కుండలు చేసేవారిసంఖ్య గణనీయంగా తగ్గింది. పల్లె ప్రాంతాల్లో అక్కడక్కడా కుండల తయారీ కనిపిస్తుంది. కానీ బెంగళూరులో పాటరీటౌన్‌లో నేటికీ మట్టిపాత్రలు చేసే సంప్రదాయం కొనసాగిస్తున్నారు. వారు ఆధునికశైలిలో దీపాలను మరింత సుందరంగా రంగురంగులతో తయారుచేస్తున్నారు. ఇలా కొత్త డిజైన్ల దీపాలు అందుబాటులోకి వచ్చాయి.

గవర్నర్, సీఎం శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటా కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు ప్రజలకు శుభాకాంక్షలు తెల్పుతూ వేర్వేరుగా ప్రకటనలు ఇచ్చారు. బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ, కుమారస్వామి శుభాకాంక్షలు తెలిపారు.



టపాసులు కొనుగోలు చేస్తున్న కుటుంబం

సీఎంపై పరువునష్టం దావా

బెంగళూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): 'ముడా' అవినీతి వ్యవహారాన్ని తొలుత రాజ్‌భవన్‌కు ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త టీజే అబ్రహం మరోసారి సీఎం సిద్దరామయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం తనను బ్లాక్‌మెయిలర్ అని, బెదిరింపులకు పాల్పడడం తన నైజమని ఆరోపించారన్నారు. సీఎంపై ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో పరువునష్టం దావా వేశానన్నారు. అక్రమంగా 14 సైట్లను పొందిన సీఎం తనపై వ్యాఖ్యానించడం సరికాదన్నారు.

ఉపపోరులో 45 మంది అభ్యర్థులు

● అత్యధికంగా చన్నపట్టణలో 31మంది..

బెంగళూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మూడు శాసనసభ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికలలో నామినేషన్ల ఉపసంహరణ బుధవారంతో ముగిసింది. మొత్తం 45మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అత్యధికంగా చన్నపట్టణలో 31మంది పోటీ చేస్తున్నారు. ఇక సండూరులో ఆరుగురు, శిగ్గావిలో 8మంది ఉన్నారు. శిగ్గావిలో బీజేపీ నుంచి భరత్‌బొమ్మై, కాంగ్రెస్ నుంచి పఠాన్ యాసిర్ అహ్మద్‌ఖాన్, సోషలిస్ట్ పార్టీ నుంచి ఖాజా మొహిద్దీన్, కర్ణాటక రాష్ట్ర సమితి నుంచి రవికృష్ణారెడ్డిలు బరిలో ఉండగా మరో నలుగురు స్వతంత్రులు ఉన్నారు. సండూరులో కాంగ్రెస్ నుంచి అన్నపూర్ణ, బీజేపీ నుంచి బంగార హనుమంతు, కర్ణాటక జనతాపక్ష నుంచి అంజనప్పలతోపాటు ముగ్గురు ఇండిపెండెంట్లు బరిలో ఉన్నారు. చన్నపట్టణలో జేడీఎస్ నుంచి నిఖిల్, కాంగ్రెస్ నుంచి సీపీ యోగేశ్వర్, ఉత్తమ ప్రజాకీయ పార్టీ నుంచి అభిషేక్, ఇండియన్ పొలిటికల్ కాంగ్రెస్ నుంచి ఉమ, రైతు భారత్ పార్టీ నుంచి నాగేశ్, ఎస్‌డిపిఐ నుంచి మహ్మద్ ఫాజిల్, పూర్వాంచల్ మహాపంచాయత్ పార్టీ నుంచి హెచ్‌డి రేవణ్ణ, యంగ్ స్టార్ ఎంపవర్‌మెంట్ పార్టీ నుంచి షాబాజ్‌ఖాన్, కర్ణాటక జనతాపక్ష నుంచి శివకుమార్, విజయజనతా పార్టీ నుంచి శ్రీధర్‌లు బరిలో ఉండగా మరో 21మంది ఇండిపెండెంట్‌లు పోటీలు ఉన్నారు.

అనర్హత వేటు ఆలస్యం..!


స్పీకర్‌కు చేరని ఎమ్మెల్యే సతీశ్ సైల్ శిక్ష తీర్పు

బెంగళూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కారవార కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్‌సైల్‌కు ఏడేళ్ల జైలు శిక్ష ఖరారు చేసి ఐదు రోజులు ముగిసినా ఇంకా శాసనసభ స్పీకర్ కార్యాలయానికి తీర్పు ప్రతులు చేరలేదు. బెళకేరి ముడిఖనిజం గల్లంతుతోపాటు పలు కేసులకు సంబంధించి శనివారం తీర్పు ప్రకటించింది. ఏడేళ్ల జైలుశిక్షతోపాటు భారీ జరిమానా విధించిన విషయం తెలిసిందే. గురువారం విచారణ ముగిసి శిక్షను ఖరారు చేశారు. అదేరోజునే ఎమ్మెల్యే నేరస్తుడిగా న్యాయస్థానం ప్రకటించింది. ఆ తర్వాత శనివారం శిక్షాకాలాన్ని వెల్లడించింది. సోమవారం కారవార పోలీసులు స్పీకర్ కార్యాలయానికి వచ్చి శిక్ష ఖరారైన విషయాన్ని తెలిపారు. కోర్టు తీర్పు కాపీలు చేర్చడంలో జాప్యమైంది. ఎమ్మెల్యే నేరస్తుడిగా ముద్రపడి ఏడు రోజులుగా శిక్ష ఖరారై ఐదు రోజులైంది. కోర్టు తీర్పు ఆదేశాలు అందినవెంటనే సతీశ్‌సైల్‌ను శాసనసభ పదవి నుంచి అనర్హుడిని చేయాల్సి ఉంటుంది. అందుకు కోర్టు కాపీలు స్పీకర్ కార్యాలయానికి చేరాల్సి ఉంది. ఏ క్షణంలోనైనా సతీశ్‌సైల్‌ను అనర్హుడిని చేయనున్నట్లు శాసనసభ అధికారులు పేర్కొంటున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

సర్దార్ వల్లభాయ్ పటేల్ (జయంతి)



'ఉక్కు మనిషి'గా పేరొందిన వల్లభాయ్ ఝవేర్‌భాయ్ పటేల్ 1875 అక్టోబరు 31న గుజరాత్ రాష్ట్రం నాడియార్‌లో జన్మించారు. దేశ తొలి ఉపప్రధానిగా కొన సాగారు. వృత్తిరీత్యా బారిష్టర్ అయినా మహాత్మాగాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాటం చేశారు. స్వాతంత్ర్య అనంతరం సంస్థానాలు దేశంలో విలీనం కావడానికి కృషి చేశారు. రాజ్యాంగ రచనలో కీలకపాత్ర వహించారు. 1950 డిసెంబరు 15న కన్నుమూశారు. మరణానంతరం 1991లో 'భారతరత్న' ప్రకటించారు. ఆయన గౌరవార్థం 2018లో ప్రపంచంలోనే ఎత్తైన ఉక్కువిగ్రహం నిర్మించారు. స్టాట్యూ ఆఫ్ యూనిటీగా కొనియాడబడ్డారు. కాగా ఆయన పేరిట ఎన్నో విద్యాసంస్థలు ఉన్నాయి.

సీకే నాయుడు (జయంతి)



భారత టెస్టు క్రికెట్ తొలి కెప్టెన్ సీకే నాయుడు 1895 అక్టోబరు 31న నాగపూర్‌లో జన్మించారు. వీరి పూర్వీకులు కృష్ణాజిల్లా మచిలీపట్నంకు చెందినవారు. పూర్తి పేరు కొఠారి కనకయ్య నాయుడు. 'పద్మభూషణ్' అందుకున్న తొలి క్రికెట్ క్రీడాకారుడు కావడం విశేషం. దేశ క్రికెట్ చరిత్రలో రెండు దశాబ్దాలు (1916-36) నాయుడు యుగంగా పేరొందాయి. ఆరు దశాబ్దాలపాటు ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడిన కొద్దిమంది క్రీడాకారులలో నాయుడు ఒకరు. రిటైరయ్యాక సెలెక్టర్‌గా, రేడియో వ్యాఖ్యాతగా ఆటతో అనుబంధం సాగించారు. 1967 నవంబరు 14న కన్నుమూశారు.

ఇందిరాగాంధీ (వర్ధంతి)



దేశ తొలి మహిళా ప్రధానమంత్రి 'భారతరత్న' గ్రహీత ఇందిరా ప్రియదర్శిని గాంధీ 1917 నవంబరు 17న అలహాబాద్‌లో జన్మించారు. దేశ తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఏకైక కుమార్తె. తండ్రి మరణానంతరం అనూహ్యంగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. తదుపరి ప్రధానమంత్రి స్థాయికి ఎదిగారు. తూర్పుపాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేశారు. పేరు ప్రఖ్యాతులు సాధించినా అనుకోని పరిస్థితుల్లో 'ఎమర్జెన్సీ' విధించి వ్యతిరేకత పొందారు. 1984 అక్టోబరు 31న హత్యకు గురయ్యారు. 1999లో బీబీసీ ఆన్‌లైన్ పోల్‌లో 'ఉమన్ ఆఫ్ మిలీనియం'గా గుర్తింపు పొందారు.

డాక్టర్ ఇన్నయ్య నారిశెట్టి (పుట్టినరోజు)



రచయిత, మానవతావాది డాక్టర్ ఇన్నయ్య నారిశెట్టి 1937 అక్టోబరు 31న గుంటూరు జిల్లా చేబ్రోలు ప్రాంతంలో జన్మించారు. పాత్రికేయుడిగా, అనువాదకుడిగా సేవలందించారు. 'సూళపాణి' కలం పేరిట రచనలు చేశారు. ఆంగ్ల, తెలుగు భాషలలో రాజకీయాలు, తత్వశాస్త్రం, మానవత్వం తదితర అంశాలపై రచనలు చేశారు. దిన, వార, మాస పత్రికలకు రచనలు అందించారు. ప్రముఖ హ్యూమనిస్ట్ ఎంఎన్ రాయ్ రచనలను అనువాదం చేయగా తెలుగు అకాడమీ ప్రచురించింది. అమెరికా తెలుగు అసోసియేషన్‌చే 1992లో శిరోమణి అవార్డు, ఇతర పురస్కారాలు పొందారు. కొన్ని అమెరికన్ పబ్లికేషన్స్‌లో కూడా ఆయన సేవలందించారు.

ట్రక్ టెర్మినల్ నిర్మాణానికి అదనపు గ్రాంటు

» మంత్రి రామలింగారెడ్డి హామీ

చింతామణి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): వాణిజ్య నగరి చింతామణిలో వాహనాల సంఖ్య పెరుగుతున్న తరుణంలో వివిధ వాహనాల కోసం ట్రక్‌టర్మినల్ ఏర్పాటుకు మంత్రి సుధాకర్ కోరిన మేరకు అవసరమైన అదనపు గ్రాంటును మంజూరు చేస్తామని దేవాదాయ, రవాణాశాఖల మంత్రి రామలింగారెడ్డి హామీ ఇచ్చారు. పట్టణ శివారులోని చింతామణి - శిడ్లఘట్ట రోడ్డు కోనపల్లి సమీపాన నిర్మించిన అసిస్టెంట్ ఆర్టీఓ నూతన భవనాన్ని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామలింగారెడ్డి మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ మంజూరుకు అవసరమైన 3 ఎకరాలలో ట్రాక్ ఏర్పాటు చేయడం ద్వారా స్థానికులు ఇతర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బంది తప్పుతుందన్నారు. సుధాకర్ అధికారంలోకి వచ్చాక చుట్టుపక్కల 140 వివిధ మార్గాలపైకి ఆగిపోయిన సర్వీస్ రోడ్లను తిరిగి అందుబాటులోకి తెచ్చారన్నారు. కాగా ట్రక్ టర్మినల్ నిర్మాణానికి 10 ఎకరాలు కేటాయించిన వెంటనే సాధ్యమైనంత త్వరగా పనులు చేపడతామన్నారు. ఇక గత బీజేపీ పాలనలో 14వేలమంది రిటైర్డు అయ్యారని కొత్త నియామకాలు చేపట్టలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక 9వేలమందిని నియమించామన్నారు. ప్రస్తుతం శక్తి పథకం ద్వారా లక్షలమంది మంది మహిళల ఉచిత ప్రయా ణానికి వీలు కల్పించా మన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ మాట్లాడుతూ 2008 నుంచి నిరంతరంగా ప్రయత్నాలు చేయగా సిబ్బంది కొరత కారణంగా ఏఆర్‌టీఓ మంజూరు చేయలేదని 2018లో అనుమతులు దక్కగా ప్రస్తుతం నూతన భవనం అందుబాటు లోకి వచ్చిందన్నారు. 2019లో ఆరున్నర ఎకరాల భూమి మంజూరు కాగా డ్రైవింగ్ ట్రాక్‌కు గత ఏడాది అదనంగా 3 ఎకరాలను గుర్తించామన్నారు. 5.75 కోట్ల రూపాయలతో ఆధునాతన భవనం, హైటెక్ ట్రాక్ సాధ్యమయ్యాన్నారు. బస్సు, లారీ డ్రైవింగ్‌కోసం జిల్లా కేంద్రమైన చిక్కబళ్ళాపురలోనూ ఇంతటి ట్రాక్ లేదని అయితే చింతామణిలో సాధ్యం చేశామన్నారు. ప్రాంతీయ కార్యాలయం పరిధిలోకి ఇదివరకు చింతామణి, శిడ్లఘట్ట ఉండగా ప్రస్తుతం చింతామణికి మాత్రమే పరిమితం చేయగా మంత్రి చొరవతో శిడ్లఘట్ట నియోజకవర్గ పరిధిలోని మన హోబళిలు చేరి కొత్తగా చేకూరు తాలూకాను చేర్చేందుకు హామీ ఇచ్చారన్నారు. ఆలయాల అభివృద్ధికి మరింత గ్రాంటు మంజూరుకు మంత్రి భరోసా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎంఎం యోగేశ్, జిల్లా అధికారి రవీంద్ర, జిల్లా పంచాయతీ సీఈఓ ప్రకాశ్ జి.టి.నిట్టాలి, జిల్లా ఎస్పీ కుశాల్‌చౌక్సి, నగరసభ అధ్యక్షుడు ఆర్ జగన్నాథ్ ఆర్టీఓ అధికారి వివేకానంద తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో మంత్రులు రామలింగారెడ్డి, డాక్టర్ సుధాకర్ తదితరులు

ఐరావత్ క్లబ్‌క్లాస్ బస్సుల ప్రారంభం

బెంగళూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన 20 ఆధునాతన ఓల్వో బస్సు ఐరావత్ క్లబ్ క్లాస్ బస్ 2.0 సర్వీసులకు సీఎం సిద్దరామయ్య పచ్చజెండా చూపారు. విధానసౌధ వద్ద బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్, రోడ్డు రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి ఇతర ప్రముఖులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామలింగారెడ్డి మాట్లాడుతూ.. ఓల్వో బస్సులు సురక్షిత, విశ్రాంతి ప్రయాణాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తాయన్నారు. ఇదే సందర్భంగా ప్రమాదాల్లో మృతి చెందిన ఆర్టీసీ సిబ్బంది కుటుంబీకులకు పరిహారం అందచేశారు. కార్యక్రమంలో మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, ఎస్ఆర్ శ్రీనివాస్, రిజ్వాన్ నవాబ్, రిజ్వాన్ అర్షద్, అన్నుకుమార్, నాగరాజ్ యాదవ్ పాల్గొన్నారు.



ఐరావత్ క్లబ్‌క్లాస్ బస్సులకు పచ్చజెండా ఊపుతున్న సీఎం తదితరులు

రెవెన్యూ మంత్రి తనిఖీ



హాజరుపట్టికను పరిశీలిస్తున్న మంత్రి కృష్ణబైరేగౌడ

మహదేవపుర, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): బెంగళూరు తూర్పు తాలూకా కేఆర్ పురలోని కార్యాలయాన్ని రెవెన్యూమంత్రి కృష్ణబైరేగౌడ బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్, ప్రత్యేక తహసీల్దార్ సహా కొంతమంది నిర్ణీత సమయానికి హాజరు కాలేదని గుర్తించారు. 12 గంటలైనా అటెండెన్స్ నమోదు కాకపోవడంపై ఆక్రోశం వ్యక్తం చేశారు. హాజరుపట్టీలో అధికారులు తమ రాకపోకల గురించి నమోదు చేయాలని సూచించారు. కాగా ప్రభుత్వ భూమి ఆక్రమణల తొలగింపులో నిర్లక్ష్యం సరికాదని, సరైన రికార్డులు ఎందుకు సమర్పించలేకపోతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని ఇకనైనా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యాలయ ప్రాంగణంలో పారిశుద్ధ పరిస్థితిని పరిశీలించారు. గైర్హాజరైన అధికారులు, పారిశుద్ధ లోపంపై నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారికి సూచించారు.

స్థూలకాయంపై అవగాహన పెంచుకోవాలి

» జాతీయస్థాయి సదస్సులో నిపుణుల వెల్లడి

బెంగళూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థూలయం సమస్యలు పెరుగుతున్నాయని ఇటీవల యువతలోనూ బేరియాట్రిక్‌తో ఇబ్బంది పడుతున్నారని అందుకు పలు కారణాలు ఉన్నాయని పీఈఎస్ మెడికల్ కళాశాల ఎండీ డాక్టర్ సురేశ్ అభిప్రాయపడ్డారు. బేరియాట్రిక్ సర్జరీపై జాతీయస్థాయి సదస్సు పీఈఎస్ మెడికల్ కళాశాలలో బుధవారం జరిగింది. దేశవ్యాప్తంగా 150మంది వైద్యనిపుణులు పాల్గొన్నారు. 50మంది ప్రయోగాత్మకంగా తమ అనుభవాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ రూపంలో చూపారు. ఇటీవలే పీఈఎస్ మెడికల్ కళాశాల ఆరంభమైన సంగతి తెలిసిందే.



సదస్సు ప్రారంభంలో డాక్టర్ సురేశ్ తదితరులు

రామయ్య ఆసుపత్రిలో పక్షవాత కేంద్రం



పక్షవాత కేంద్రం ఆరంభంలో ఆసుపత్రి ప్రెసిడెంట్ నాగేంద్రస్వామి తదతరులు

బెంగళూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పక్షవాత నివారణ దినాన్ని పురస్కరించుకుని రామయ్య ఆసుపత్రిలో పక్షవాత కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గుణాత్మకమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్టు రామయ్య మెమోరియల్ ఆసుపత్రి ప్రెసిడెంట్ నాగేంద్రస్వామి అభిప్రాయపడ్డారు. మంగళవారం ఆసుపత్రిలో ప్రత్యేక కేంద్రాన్ని ఆరంభించారు. సీఓఓ మదన్‌గైక్వాడ్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అరుణ రమేశ్, న్యూరో సర్జరీ విభాగం హెచ్‌ఓడి సునిల్ పుర్టోడా, న్యూరాలజీ నిపుణుడు మహేంద్రలు భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా నాగేంద్రస్వామి మాట్లాడుతూ దేశంలో ప్రతి లక్షమందికి 138మందికి పక్షవాతం వస్తోందన్నారు. పక్షవాతం ప్రబలిన నాలుగైదు గంటలలోగా ఆసుపత్రికి తీసుకెళ్తే త్వరితగతిన నయం చేసేందుకు వీలుందన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమన్నారు. అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వర్తూరులో ఎమ్మెల్యే పరిశీలన

మహదేవపుర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వర్తూరులో ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి, మాజీ మంత్రి అరవింద లింబావళి, అధికారులతో కలసి కేఆర్‌డీసీఎల్ రోడ్లను పరిశీలించారు. వర్తూరు రోడ్ల విస్తరణకు సంబంధించి స్థానిక భూయజమానులతో సమావేశం నిర్వహించారు. జలమండలి, బెస్కాం, ఇతర అధికారులతో కలసి చర్చించారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణకు భూములు కోల్పోయిన వారికి పరిహారం కేటాయించడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహరరెడ్డి, రూరల్ అధ్యక్షుడు నటరాజ్, ప్రముఖులు వర్తూరు శ్రీధర్, రాజేశ్ మహేంద్రమోది, కేఆర్‌డిసిఎల్, బెస్కాం, జలమండలి, బీబీఎంపీ రోడ్లు, వార్డు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



రోడ్ల పరిశీలనలో ఎమ్మెల్యే మంజుల, మాజీ మంత్రి లింబావళి తదితరులు

ఉపాధ్యాయ వృత్తికి వెల కట్టలేం

బంగారపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయవృత్తి పవిత్రమైనదని అందుకు వెలకట్టలేమని బీఈఓ జి గురుమూర్తి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని హొసకోటె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎన్ వెంకటేశప్ప రిటైరైన సందర్భంగా ఆత్మీయ వీడ్కోలులో సన్మానించి మాట్లాడారు. మన సామర్థ్యానికి తగిన పనిలో చేరతామని, అదే విధంగా రిటైర్మెంట్ సామాన్యమన్నారు. 30ఏళ్లపాటు సేవలందించిన టీచర్ వెంకటేశప్ప ఎంతోమంది ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన రిటైర్మెంట్ జీవనం సంతోషంగా గడవాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంకే శశికళ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అప్పయ్యగౌడ, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయగౌడ తదితరులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయుడు వెంకటేశప్పకు సన్మానం

మాది పేదల ప్రభుత్వం: ఎమ్మెల్యే



జనస్పందనలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తదితరులు

బాగేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదల ముంగిటకే పాలనాయంత్రాంగం రావడం ద్వారా సమస్యలను ఆలకించి పరిష్కరించేలా కాంగ్రెస్ ప్రభుత్వం శ్రమిస్తోందని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. తాలూకాలోని కొత్తకోట సమీపాన తాలూకా రెవెన్యూశాఖ, తాలూకా పంచాయతీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన జనస్పందన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలతో మహిళలు, పేదలకు ఎంతో ప్రయోజనకారిగా ఉన్నాయన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ వివాదాలను పరిష్కరించనున్నట్టు తెలిపారు. తహసీల్దార్ మనిషా మహేశ్ ఎస్ పత్రి మాట్లాడుతూ జనస్పందన కార్యక్రమం ద్వారా సామాన్యుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. స్త్రీశిశుసంక్షేమశాఖ సీడీపీఓ రామచంద్రప్ప నేతృత్వంలో 12మంది గర్భిణీలకు సామూహిక సీమంత చేశారు. 227 అర్జీలు రాగా వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. రెవెన్యూశాఖ 400 పౌతి, 450 పింఛను సహా భాగ్యలక్ష్మి బాండ్లు, 90మందికి హక్కుపత్రాలు మంజూరు చేశారు. దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో వాకర్‌లు, అంధ విద్యార్థులకు మొబైల్, శ్రవణ సాధనాలు, ఇతర ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేడీపీ సభ్యుడు మంజునాథరెడ్డి, ఈఓ జీవి రమేశ్, తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ సీఎన్ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో తనిఖీ

ధర్మవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోను ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ రమేశ్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. ప్రయాణికులకు ఎలాంటి సౌకర్యాలు అందిస్తున్నారో పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగీ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. బస్సులను శుభ్రంగా.. మంచి కండీషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

నల్లమాడ, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ దాదాపీర్ ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌బాబు, నాగరాజు, కానిస్టేబుల్ నరసింహయ్య, అశోక్, నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక వాహనాల సీజ్

బత్తలపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిశనపల్లి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు టిప్పర్లు, రెండు ఎక్స్‌కవేటర్లను సీజ్ చేసినట్లు సీఐ ప్రభాకర్ బుధవారం తెలిపాడు. చిత్రావతి నది నుంచి ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వాటిని సీజ్ చేశామన్నారు. ఆయన వెంట ఎస్ సోమశేఖర్, సిబంది ఉన్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

కదిరి అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు పది లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగుచేయాల్సి ఉండగా, సకాలంలో వర్షాలు కురవకపోవడంతో కనీసం రెండులక్షల ఎకరాల్లో కూడా పంటలు వేయలేదన్నారు. జిల్లాలో పది మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించడం సరికాదన్నారు.

లబ్ధిదారులను ఇబ్బంది పెట్టొద్దు

పుట్టపర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులను ఇబ్బంది పెట్టొద్దని ఏజెన్సీల నిర్వాహకులను కలెక్టర్ చేతన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీ కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. గ్యాస్ కనెక్షన్ల లబ్ధిదారుల వివరాలు, ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇబ్బందులు పడకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

అందుబాటులో టీటీడీ క్యాలెండర్, డైరీలు



క్యాలెండర్లను ప్రదర్శిస్తున్న ఏఈఓ బాలరాజు తదితరులు

బెంగళూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంకు సంబంధించి 2025వ వార్షిక క్యాలెండర్, డైరీలు వయ్యాలి కావల్‌లోని ఆలయంలో భక్తుల కోసం అందుబాటులో ఉన్నట్లు ఏఈఓ బాలరాజు ప్రకటించారు. బుధవారం టీటీడీఈ ఆలయ ప్రాంగణంలో లాంఛనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ జయంతి మీడియాతో మాట్లాడుతూ ఏటా వయ్యాలికావల్ ఆలయంలో క్యాలెండర్‌లు, డైరీలు విక్రయాలు ఉంటాయన్నారు. ఈ ఏడాది ఆరు విధాల క్యాలెండర్‌లు, రెండు రకాల డైరీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఒక లక్ష క్యాలెండర్‌లతో పాటు 40వేల డైరీలు ఉన్నాయన్నారు. ప్రతి రోజు ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల దాకా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు ద్వారా విక్రయాలు సాగిస్తామన్నారు. కార్తీక మాసంలో ఒక రోజు దీపోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటా భగవద్గీత సందేశాలు పంపేందుకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ విస్తృతంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారక్ భుజంగరావ్ తెలిపారు. విద్యాసంస్థలలో విద్యార్థులకు భగవద్గీత చిన్నపుస్తకాలను అందిస్తున్నామన్నారు. ఎంతమంది విద్యార్థులు ఏఏ భాషలలో అవసరమనేలా వినతి అందిస్తే పుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధమన్నారు. ప్రస్తుతం 5లక్షల పుస్తకాలు ఉన్నాయన్నారు. టీటీడీ సూపరింటెండెంట్‌కు భగవద్గీత పుస్తకాలు అవసరమైన విద్యాసంస్థలు వినతులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

జేడీఎస్ క్యాంపెయినర్ల జాబితాలోలేని జీటీ దేవెగౌడ



జీటీ దేవెగౌడ

బెంగళూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మూడు శాసనసభా స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికలలో ప్రచారాల కోసం జేడీఎస్ పార్టీ ప్రకటించిన స్టార్ క్యాంపెయిన్లలో కోర్ కమిటీ అధ్యక్షులు జీటీ దేవెగౌడకు చెక్ పెట్టారు. చన్నపట్టణతో పాటు సండూరు, శిగ్గావి స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా బుధవారం స్టార్ ప్రచారకుల జాబితాను విడుదల చేశారు. ఇందులో పార్టీకు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి, ప్రస్తుతం కోర్‌కమిటీ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న జీటీ దేవేగౌడను జాబితా నుంచి దూరంగా ఉంచారు. సండూరు, శిగ్గావి స్థానాల నుంచి బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తుండటంతో పాటు జేడీఎస్‌కు అంతగా పట్టు లేకపోవడంతో ప్రాధాన్యత ఉండదు. చన్నపట్టణ నుంచి జేడీఎస్ జాతీయనేత దేవేగౌడ మనవడు నిఖిల్ పోటీ చేస్తుండటంతో కీలకంగా భావిస్తున్నారు. ఏకంగా 40 మంది స్టార్ క్యాంపైనర్‌ల జాబితాను ప్రకటిం చారు. వీరంతా చన్నపట్టణలో నిత్యం ప్రచారంలో పాల్గొనాలనే సూచించినట్లు తెలుస్తోంది. స్టార్ ప్రచారకులలో జేడీఎస్ జాతీయ అధ్యక్షులు దేవేగౌడ, కేంద్రమంత్రి కుమారస్వామి, శాసనసభా పక్ష నేత సురేష్‌బాబు, అనితా కుమారస్వామి, రేవణ్ణలతో పాటు పలువురు ఉన్నారు. జేడీఎస్‌లో జీటీ దేవేగౌడ కీలక నేతగానే కొనసాగుతుండేవారు. కానీ మైసూరు దసరా ఉత్సవాల వేళ ముడా ఇంటి స్థలాల వివాదంపై బహిరంగ సభలో జీటీ దేవేగౌడ పార్టీ ముఖ్యనేత కుమారస్వామిపై విరుచుకుపడ్డారు. సీఎం సిద్ద రామయ్యను రాజీనామా కోరే కుమారస్వామిపైనా అవినీతి ఆరోపణలు, కేసులు ఉన్నాయని ఆయన రాజీనామా చేస్తారా అంటూ ప్రశ్నించారు. ఇలా రెండు వారాలుగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. అయితే జీటీ దేవేగౌడ కుమారుడు ఎమ్మెల్యే హరీష్‌గౌడ స్టార్ ప్రచారకుడి జాబితాలో ఉన్నారు. ఇదే విషయమై మైసూరులో జీటీ దేవేగౌడ మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు పనులు ఉన్నాయని ఎన్నికలలో పోటీ చేసిన వారికి మంచి జరగాలని, నాకు ఎవరూ ప్రచారానికి పిలవలేదని నేను వెళ్ళడం లేదన్నారు.

పోలీసుశాఖపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

శిడ్లఘట్ట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని శిడ్లఘట్ట పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. పోలీసుశాఖ తీరుపై అవగాహన కల్పించేందుకు తాలూకాలోని హనుమంతపురగేట్ సమీపానగల బిజిఎస్ స్కూల్ రెండో తరగతి విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌కు విచ్చయగా టౌన్ ఎస్సై వేణుగోపాల్ ఆత్మీయంగా స్వాగతించారు. పోలీసుశాఖ అంటే ఏమిటి, ఎవరెవరు ఎలాంటి విధులు నిర్వహిస్తారు, ప్రజలకు ఎలాంటి సాయం లభిస్తుందని సిఐ, ఎస్సైలు వివరించారు. శిడ్లఘట్ట పట్టణంలో ట్రాఫిక్ క్రమేపీ పెరుగుతోందని హనుమంతపుర వద్ద రోడ్డు దాటేవేళ ట్రాఫిక్ నియమాలు పాటించాలని విద్యార్థులకు తెలియచేశారు. . పిల్లలకు సైతం అర్థమయ్యేలా ప్రశ్నలు అడిగి వారినుంచి సమాధానాలు రాబట్టి ప్రతిభను అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం కేఎస్ లక్ష్మి, లావణ్య, శిల్ప గౌతమి పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,608.40
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,626	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,386	8,909
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	34.53

థియేటర్లలో కన్నడ చిత్రాలు

తప్పనిసరి: కలెక్టర్



బళ్లారి సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కన్నడ రాజ్యోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని మెగా, వీడియో థియేటర్లలో వారం రోజుల పాటు కన్నడ చిత్రాలనే ప్రదర్శించాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఒక ప్రకటనలో ఆదేశించారు. కన్నడ సినిమాలను ప్రదర్శించకపోతే సినిమా హాళ్ల లైసెన్స్ రెన్యువల్ చేయబోమని, అక్టోబరు 31, నవంబరు 1 తేదీల్లో సినిమా హాళ్లలో తప్పనిసరిగా లైట్లు వేయాలని సూచించారు. నవంబరు 1 నుంచి 7 వరకు కన్నడ సినిమాలనే ప్రదర్శించాలన్నారు.

పింఛన్‌దారుల ఇంటి వద్దకే జీవిత ధ్రువీకరణ పత్రం

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెన్షన్స్, పెన్షనర్స్ వేల్ఫేర్ నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ సమన్వయంతో సెంట్రల్ స్టేట్ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆధ్వర్యంలో పెన్షనర్లందరికి లైఫ్ సర్టిఫికెట్ జారీ చేడానికి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సేవను ప్రవేశ పెట్టింది. నవంబరు 1 నుంచి నవంబరు 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈకార్యక్రమంలో పింఛన్ దారులు తమ సమీపంలోని తపాలా కార్యాలయం వెళ్లడం గాని, తమ ప్రాంతంలోని తపాలా శాఖ పోస్టుమెన్‌ను సంప్రదించి ఇంటివద్దే వేలి ముద్రలు, ఫేస్ స్కానింగ్ ఇచ్చి తమ జీవన ప్రమాణ పత్రాలు పొందవచ్చు. నవంబరు 4న బళ్ళారి ప్రధాన తపాలా కార్యాలయం, నవంబరు 8న హొసపేట ప్రధాన తపాలా కార్యాలయం, నవంబరు 16న కూడ్లిగి, 2న సిరుగుప్ప, 24న హరపనహళ్ళి తపాలా కార్యాలయం వ్యాప్తిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సేవల కోసం పింఛను దారులు రూ 70లు చెల్లించి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని సిబ్బందికి అందజేయాల్సి ఉంటుందని బళ్లారి విభాగం తాపాలా శాఖ సూపరింన్డెంట్ పి.చిదానంద ఒక ప్రకటనలో తెలిపారు.

ఊరిస్తున్న సీతాఫలం

● మొలకాల్మూరులో 3,970 హెక్టార్లలో సాగు ● కూలీలకు ఉపాధి



అమ్మకానికి సిద్ధంగా ఉన్న సీతాఫలాలు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సాధారణంగా అటవీ ప్రాంతాలు, కొండప్రాంతాల్లో పెరిగే సీతాఫలానికి మంచి డిమాండ్ ఉంది. బళ్లారి జిల్లా సరిహద్దు ప్రాంతమైన చిత్రదుర్గ జిల్లా మొలకాల్మూరు ప్రాంతం చుట్టూ ఎత్తైన కొండప్రాంతాలు ఉండడంతో సీతాఫలం పంట సాగుకు అనువుగా ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే ప్రతి పండు పక్వదశకు చేరుకోవడానికి కార్బన్, ఇతరత్రా రసాయనాలు ఉపయోగిస్తుంటారు. అయితే కొండ ప్రాంతాల్లో లభించే సీతాఫలం మాగడానికి ఎలాంటి రసాయనాలు వేయకుండానే వాతావరణంలో ఉన్న వేడికే మాగుతుంది. అటవీ సీతాఫలం వ్యాపారంగా చేసుకుని మొలకాల్మూరు చుట్టుపక్క ప్రాంతాలకు చెందిన కూలీలు ఉపాధి పొందుతున్నారు. తాలూకా పరిధిలోకి వచ్చే మొలకాల్మూరు, హానగల్, కాటనాయకనహళ్ళి, నుంకిమలెబెట్ట, కూగెబండ, ఎద్దలబొమ్మయ్యనహట్టి, కోనసాగర, మర్లహళ్ళి, పూజారహట్టి, హిరేకెరహళ్ళి రోడ్డు, గుడేకోట రోడ్డు, బొమ్మదేవరహళ్ళి ప్రాంతాల్లో ఉన్న కొండ ప్రాంతాల్లో భారీ ప్రమాణంలో సీతాఫలం చెట్లు ఉన్నాయి. అక్కడ లభించే సీతాఫలం మొలకాల్మూరు పట్టణం, రాయాపుర క్రాస్, రాంపురం 150-ఎ జాతీయ రహదారి ఫుట్‌పాత్‌లపై పెట్టుకుని వ్యాపారం చేస్తుంటారు. గుత్తకు తీసుకున్న వారు పండ్లు కోసుకొచ్చే కార్మికుల నుంచి తీసుకుని నిత్యం దావణగెర, బళ్ళారి, రాయచూరు, చిత్రదుర్గ, హిరియూరు, చెళ్ళకెర, మంగళూరు, శివమొగ్గ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. ఒక్కో గంప, ప్లాస్టిక్ సంచి లెక్కప్రకారం మొదట కాయి ధర నిర్ణయిస్తారు. ప్రతి గంప సీతాఫలానికి రూ.300 నుంచి రూ.400 ధర పలుకుతుండగా సంచి సీతాఫలానికి రూ.700 నుంచి రూ.800 ధర లభిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అధికంగా దిగుబడి వచ్చిందని, తద్వారా ధర పడిపోయిందని, దీనికి తోడు ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్న కారణంగా చెట్టునుంచి కాయి పండుగా మారి కిందపడిపోతోందని అంటున్నారు. ఈ ఏడాది చాలావరకు సీతాఫలాలు కోతకోయలేని స్థితిలో చెట్లలోనే ఉండిపోయని వ్యాపారస్తులు వాపోతున్నారు.



కొండపై విరగ్గాసిన సీతాఫలం చెట్టు

కాంగ్రెస్ నిర్ణయాలతోనే భూవివాదాలు

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీటీ రవి ఆగ్రహం



మీడియాతో మాట్లాడుతున్న సీటీ రవి

బళ్లారి సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ తప్పుడు నిర్ణయాలతోనే నగరంలో భూ వివాదాలు ఏర్పడుతు న్నాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిటీ రవి మండిపడ్డారు. బుధవారం నగరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి ఒకే రాజ్యాంగం మాత్రమే ఉండాలని, తాను ఏ ముస్లింలను నిందించడం లేదన్నారు. భూసేకరణకు మన్మోహన్‌సింగ్ అధికారం ఇచ్చారు. ముస్లింలతో కూడిన వక్ఫ్ బోర్డుతో ప్రజలకు ఎలా న్యాయం చేస్తారన్నారు. ఓ వైపు ప్రభుత్వ హయాంలో దేవాలయాలను కూల్చివేసిందని, మరోవైపు ల్యాండ్ జిహాద్ నిర్వహించే అధికారం కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించ లేదన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఇస్లామిక్ దేశాల్లో ఇలాంటి వక్ఫ్ చట్టం లేదన్నారు. మన లౌకిక దేశంలో కాంగ్రెస్ అలాంటి చట్టాన్ని రూపొందించిందన్నారు. ఉప ఎన్నికల్లో మూడు స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమన్నారు. ప్రభుత్వ అవినీతి, ధరల పెరుగుదల, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల ముందు ఉంచుతున్నామన్నారు. తప్పు చేసిన వారిని శిక్షించాలని ఎప్పుడు చెప్పే ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వాల్మీకి సొమ్ము దుర్వినియోగమైందని అలా చేసినవారిని శిక్షించాలన్నారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్ నాయుడు, విధానపరిషత్ సభ్యుడు శశిల్ నామోషి, యం.సతీశ్, నాయకులు కే.రామలింగప్ప, గురలింగనగౌడ, గుత్తిగనూరు విరూపాక్షగౌడ, హెచ్.హనుమంతప్ప, గోనాల్ మురాహర్ గౌడ్, టీకే సుందర్, మల్లనగౌడ్, సుమారెడ్డి, గడ్డి శంకరప్ప, రామకృష్ణ, గణపాల్ ఐనాథ్‌రెడ్డి తదితరులున్నారు.

జోరుగా ప్రచారం



తిమ్మలాపురంలో మాట్లాడుతున్న బంగారు హనుమంతప్ప

కంప్లి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రచారం ఊపందుకుంది. బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతప్ప బుధవారం కుడితిని తిమ్మలాపురం దరోజీ మాదాపురం తదితర గ్రామాల్లో పర్యటించారు. గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీరాములు, అనిల్ లాడ్, దివాకర్ నేతృత్వంలో జోరుగా ప్రచారాలు చేపట్టారు. ఈసందర్భంగా తిమ్మలాపురంలో హనుమంతప్ప మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తమకు అవకాశం కల్పిస్తే గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. వారితో పాటు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

ఉప ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. జిల్లా పరిధిలోని వేణి వీరాపురం చెక్‌పోస్టు వద్ద బుధవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారి పంపానాయక్ మాట్లాడుతూ వాహనాల్లో ఆధారాలు లేకుండా నగదు తరలిస్తే పోలీసులకు అప్పగిస్తామన్నారు. పగలు, రాత్రివేళల్లో పోలీసులు గట్టి బందోబస్తు చేస్తూ తనిఖీలు చేపడుతున్నారన్నారు.

పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

● జడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాల-అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యంపై తగదని, వారి అభివృద్ధిలో లోపాలుంటే వెంటనే గుర్తించి ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి జడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప సూచించారు. బుధవారం జిల్లా పంచాయతీ వీడియో హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా ఆరోగ్య సంఘం సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్రీయ శిశు ఆరోగ్య కార్యక్రమం కింద పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పిల్లల ఎదుగుదలలోపాలను ఆర్‌బీఎస్‌కే వైద్యుల బృందం గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. అన్ని ఆర్‌బీఎస్‌కే బృందాలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి నిర్ణీత గడువులోగా పిల్లలందరికి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఏ బిడ్డకైన దృష్టిలోపం, వినికిడి లోపం, మాటతీరు, పెదవి విరుపు, అంగిలి చీలిక, గుండె సమస్యలు, శారీరక వైకల్యాలతోపాటు తీవ్రమైన సమస్యలను గుర్తించి చికిత్స అందించాలన్నారు. గర్భిణీలకు మదర్ కార్డులు అందజేయాలని, భ్రూణ హత్యలు జరగకుండా చూడాలన్నారు. ఆడపిల్ల పుట్టిన కుటుంబాన్ని గౌరవించడంతోపాటు గ్రామపంచాయితీ ద్వారా కిట్‌ను బహుమతి రూపంలో అందజేసేలా చర్యలు తీసుకోవాలని, గర్భిణులకు కనీసం నాలుగు పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యాధులపై అవగాహన కల్పించే శకటాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈసందర్భంగా జిల్లాసర్జన్ డాక్టర్ బసారెడ్డి, విమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ చిదాంబరమూర్తి, డాక్టర్ అబ్దుల్లా, డాక్టర్ పూర్ణిమకట్టిమణి, డాక్టర్ వీరేంద్రకుమార్, డాక్టర్ హనుమంతప్ప, డా.భరత్, డా.పవన్, జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, కన్సల్టెంట్ డాక్టర్ సురేశ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవం



అధ్యక్షుడు కల్లుగి మంజునాథ్, ఉపాధ్యక్షుడు మహంతేశ్

బళ్లారి సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోలాచలం కాంపౌండ్‌లో ఏడేళ్ల క్రిత్రం ఆవిర్భవించిన శ్రీ శరణ సక్కరే కరడీశ సౌహార్ద పత్తిన సహకార బ్యాంక్ నూతన అధ్యక్షుడిగా కల్లుగి మంజునాథ్, ఉపాధ్యక్షుడిగా తెంగినకాయి మహంతేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం బ్యాంక్ ఆవరణలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహమ్మద్ ఖలీద్ భాషా ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. గతంలో ఎన్నికైన కేణి బసప్ప, బద్దిగేరి ఎర్రిస్వామి రాజీనామా చేయడంతో రెండేళ్లకు ఎన్నికలు జరిగాయి. నూతన అధ్యక్షుడు మంజునాథ్ మాట్లాడుతూ.. బ్యాంక్ అందరి సహకారంతో బ్యాంక్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. కోరి విరూపాక్షప్ప, గుత్తిగనూరుకు చెందిన చంద్రగౌడ్, జాడే మూర్తి, ప్రకాశ్, హావినాల్ బసవరాజ్, హావినాళ శరణప్ప, టెక్కలకోట వీరేశ్, గంగావతి వీరేశ్, కేణి బసవరాజు, లింగనగౌడ, శివరాం, విజయకుమార్, నాగప్ప, బ్యాంక్ సీఈఓ శంభులింగప్ప పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థుల అభివృద్ధే లక్ష్యం

●ధర్మస్థళ పర్యవేక్షకుడు లక్ష్మీకాంత్ కోళూరు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంస్థ పదాధికారులు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంత విద్యార్థులతో పాటు గ్రామీణ విద్యార్థులను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ధర్మసళ క్షేమాభివృద్ధి సంస్థ కోళూరు విభాగం పర్యవేక్షకులు లక్ష్మీకాంత్ కోళూరు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల సౌకర్యార్థ సాయంత్రం వేళ ట్యూషన్లు ఏర్పాటు చేశామన్నారు. తాలూకా పరిధిలోని కోలూరు విభాగం పరిధిలో బైలూరు అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున మాట్లాడుతూ విద్య పిల్ల వికాసానికి, సమాజాభివృద్ధికి విద్య మూలస్తంభమని, వ్యక్తులను శక్తివంతులు చేయడానికి, విమర్శనాత్మక ఆలోచనలు పెంపొందించడానికి ఒక శక్తివంతమైన సాధన అన్నారు. ధర్మస్థల పీఠాధిపతులు రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శ్లాఘనీయమన్నారు. కార్యక్రమంలో ఆశా జ్ఞాన వికాస కో ఆర్డినేటర్, పాఠశాల ఉపాధ్యాయులు, యమూర్ ట్యూషన్ ఉపాధ్యాయులు, బసవరాజు, బిఎల్ఇ స్థానిక సేవా ప్రతినిధులు వీరమల్లమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

బళ్లారి సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ ఆర్గనైజేషన్, బళ్లారి జిల్లా ఆరోగ్యశాఖ, మైనారిటీ కమ్యూనిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహించి 28మందికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీచేశారు. ఈసందర్భంగా లింగ నిర్ధారణ, మైనార్టీ వర్గాలకు చెందిన 35మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.ఈసందర్భంలో దత్తాత్రేయ, ఎం.ఎ.షకీబ్, రెండ్‌క్రాస్ సంస్థ మహబూబ్ భాషా తదితరులు పాల్గొన్నారు.

దీపావళి స్వచ్ఛత సేవా జాతా

బళ్లారి సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువకేంద్రం, వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ కమిటీ, జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో 'మై ఇండియా విత్ దీపావళి' కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెటింగ్ కమిటీ సహాయ కార్యదర్శి కర్రిగౌడ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. మార్కెటింగ్ కమిటీ అధికారి ఎం.నంజుడస్వామి, నెహ్రూ యువజన కేంద్రం జిల్లాయువజన అధికారి మోంటు పత్తార్, జాతీయ గణాంకశాఖ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నిధులు లేక నిలిచిపోయిన నిర్మాణం

కంప్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం రచించిన బాబాసాహెబ్ అంబేడ్కర్ భవనమే మధ్యంతరంగా నిలిచిపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. జిల్లాలోని సండూరు తాలుకా చోర్నూరు గ్రామంలో 2019లో భవన నిర్మాణానికి రూ.50 లక్షలు సమాజ కళ్యాణ నిధుల కింద మంజూరు చేశారు. కానీ 2022లోనే ప్రారంభం కావాల్సి వుండగా ఇప్పటివరకు ఇంకా ప్రారంభం కాకపోవడం విడ్డూరంగా వుందని అంబేడ్కర్ సంఘం సభ్యులు తెలిపారు. ఇప్పటికే చోర్నూరులో నిర్మిస్తున్న భవనానికి రూ.50 లక్షలకు పైగా నిధులు మంజూరయ్యాయి. దాంట్లో రూ.39 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. ఇంకా రూ.11 లక్షలు నిధులు విడుదల కాక మధ్యంతరంగా నిలిచిపోయిందన్నారు. పలు చోట్లనిధులు సక్రమంగా విడుదల కాక భవనాలు అర్థాంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు భవనాలు పూర్తయ్యేవరకు జాగ్రత్త వహించి, వాటిని ప్రారంభించాలని కోరారు.



పూర్తి కాని అంబేద్కర్ భవనం

పోలీసు శాఖలో ట్రాన్స్‌జెండర్‌కు అవకాశం

● లాఠీ పట్టనున్న మంగళముఖి మధుశ్రీ



బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):పోలీసులు అంటేనే ఇప్పటీ సామాన్యుడి భయమే.... అందుకు పోలీసు శాఖ జనస్నేహిగా ఉండాలని పోలీసు ఉన్నతాధికారులు క్రింది స్థాయి అధికారులకు చెబుతుంటారు. ఇప్పటి వరకు పోలీసు శాఖలో ఆడ, మగ పోలీసులే కనపించే వారు. ఇక నుండి ట్రాన్స్‌జెండర్స్ కూడా ప్రజా సేవ చేసేందుకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించడంతో పోలీసు శాఖలో ట్రాన్స్‌జెండర్స్‌కు 1 శాతం రిజర్వు చేయడంతో ఇక నుండి ప్రజలను కాపాడడంతో ట్రాన్స్‌జెండర్స్ తమవంతు బాధ్యత వహించనున్నారు. సమాజంలో ట్రాన్స్‌జెండర్స్ అంటే ఒకరకమైన చిన్నచూపుకు గురవుతుంటారు. అవేమి పట్టించుకోకుండా ఎంతోమంది ట్రాన్స్‌జెండర్స్ స్వావలంబన జీవనం గడుపుతూ సమాజంలో మాదిరిగి నిలుస్తున్నారు. ఎలాంటి తప్పుదారి పట్టకుండా సమాజంలో మాదిరిగా నిలిచిన ట్రాన్స్‌జెండర్స్ ప్రస్తుతం మన మధ్యలోకి రానున్నారు. ప్రస్తుతం కొప్పళ నగరానికి చెందిన ఓ ట్రాన్స్‌జెండర్ పోలీసు శాఖలో సేవలు అందించడానికి సిద్ధమైంది. ఈ కోవలోనే కొప్పళ జిల్లా కారటిగి తాలూకా తొండిహాల్ గ్రామానికి చెందిన మధుశ్రీ అనే ట్రాన్స్‌జెండర్ పోలీసు కానిస్టేబుల్‌గా ఎన్నికయ్యారు కేవలం కొన్ని రోజుల్లోనే చేతిలో లాటీ పట్టుకుని ప్రజల రక్షణ సిద్ధమవుతున్నారు. తద్వారా భవిష్యత్‌లో పోలీసు శాఖలో ట్రాన్స్‌జెండర్స్ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్స్‌కు 1% శాతం రిజర్వేషన్ కల్పించిన నేపథ్యంలో కొప్పళ జిల్లాకు చెందిన మధుశ్రీ అనే ఓ ట్రాన్స్‌జెండర్‌కు అపురూపమైన అవకాశం దక్కింది. హిజ్రాలను కన్నడలో మంగళముఖిగా పిలుస్తారు. మంగళ ముఖిగా మధుశ్రీ ప్రస్తుతం లిఖితగా పేరు మార్చుకున్న దేహదారుఢ్య పరీక్షల్లో కూడా పాసైంది. ప్రస్తుతం అధికారుల నుండి అంతిమ ఆదేశాల కోసం వేచి చూస్తోంది. తద్వారా ప్రస్తుతం పోలీసు శాఖలో సేవలు అందించేందుకు లిఖిత సిద్ధంగా ఉంది. మొదట్లో మారుతిగా అలియాస్ మధుశ్రీగా మారిన మంగళముఖి విశిష్టమైన సాధనకు గ్రామంలో మన్ననలు పొందుతోంది. నోటిఫికేషన్ ప్రకటన తరువాత అర్జివేసి అనంతరం ఒక నెల పాటు ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకుని ఇంటిలో రాతపరీక్షకు ప్రిపేరై పరీక్షల్లో పాసైనట్లు మధు శ్రీ అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వం అన్ని శాఖలో మంగళ ముఖిలకు ఇదేరీతిలో అవకాశాలు కల్పించి మంగళముఖిల సంక్షేమానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతోంది.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిక

కంప్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్, వెంకటరమణబాబు ఆధ్వర్యంలో 17వ వార్డు గౌతమ్ నగర్‌లో వందకు పైగా బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. బుధవారం గౌతమ్ నగర్‌లో పార్టీలో చేరిన వారికి వీఎం రాజశేఖర్ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుడితిని పట్టణానికి ఎంతో మంది బీజేపీ నాయకులు గాలి జనార్దన్ రెడ్డి, బసవరాజు, శ్రీరాములు, ఎంత మంది బీజేపీ పార్టీ అభ్యర్థి బంగారు హనుమంతు గెలుపు కోసం ఎన్ని ప్రయత్నాలు, కుతంత్రాలు చేసిన బీజేపీ పార్టీలో ఎలాంటి అభివృద్ధిలేక తమ కాంగ్రెస్ పార్టీలోకి మా నాయకులు తుకారామ్, సంతోష్‌లాడ్ చేసిన అభివృద్ధి పనులకు ఆసక్తులై పార్టీలోచేరారన్నారు. బీజేపీ పార్టీ నాయకులు కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమయ్యారన్నారు. నాయకులు వచ్చినా ప్రయోజనం లేదని కాంగ్రెస్ పార్టీలోకి బీజేపీ నుంచి అధికంగా వలసలు వస్తున్నారన్నారు. గతంలో శ్రీరాములు మంత్రిగా వున్న సమయంలో గౌతమ్ నగర్ అభివృద్ధి చేసి సుమారు 300 కుటుంబాలకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంతవరకు తిరిగి చూడక పోవడంతో ఇచ్చిన మాట విఫలం కావడంతో వారు విసుగు చెంది తమ పార్టీలోకి వస్తున్నారన్నారు. అనంతరం హళ్లిళ్లి రాము మాట్లాడుతూ గతంలో 14వ వార్డు బీజేపీ మెంబర్‌గా కౌన్సిలర్‌గా పోటీచేశాం. తమకు అభివృద్ధి కనపడకపోవడంతో తమతోపాటు సిద్ధయ్య, యర్రిస్వామి, రాము, రుద్ర, ఎంతో మంది పార్టీలో చేరుతున్నారన్నారు. రానున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అన్నపూర్ణ విధుల కోసం ఇక్కడున్న నాయకులు వి రాజశేఖర్ ఆధ్వర్యంలో గెలుపుకు నాంది పలుకుతామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పంచాయతీ ఉపాధ్యక్షులు కనికేరి పంపాపతి, దొడ్డబసప్ప, గంగాధర, మడివాళ రాజప్ప, సిద్ధలింగస్వామి, మాంతేష్, చిత్రప్ప, విక్కి తదితరులు పాల్గొన్నారు



కండువా కప్పి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, వెంకటరమణబాబు

హొసూరు జోన్

పౌర కార్మికులకు దీపావళి కిట్లు



దీపావళి కిట్ అందచేస్తున్న మేయర్ సత్య

హోసూరు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగర పరిధిలో దీపావళీ పండుగ సందర్భంగా 100 మందికిపైగా పౌర కార్మికులకు మేయర్ సత్య స్వీట్స్‌తో కూడిన ప్రత్యేక కిట్‌లను బుధవారం బహుమతిగా పంపిణీ చేశారు. హోసూరు మున్సిపల్ కార్పరేషన్, కామరాజ్ కాలనీ ఏరియాల్లో ప్రతిరోజు హోసూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్న పారిశుధ్య కార్మికుల సేవలన ప్రశంసించారు. కార్యక్రమంలో హోసూరు మున్సిపల్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, మోసిన్‌తాజ్ నిసార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, వివిధ శాఖల అధికారులు

హోసూరు(కృష్ణగిరి)అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని బుధవారం అర్థవంతంగా నిర్వహించారు. కలెక్టర్ కె.ఎం.సరయు నేతృత్వంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. దీపావళి పండుగ సెలవు నేపథ్యంలో ఒకరోజు ముందుగా కార్యక్రమం నిర్వహించారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడటానికి నన్ను నేను అంకితం చేస్తానని, దేశం సామరస్యాన్ని కొనసాగించడానికి పాటుపడతానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి సాధనకురళ్, జిల్లా కలెక్టర్ సహాయకురాలు పి.పుష్ప, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ కదిరవన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలు

హోసూరు అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): రహదారి మరమ్మతులతో వాహనదారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. హోసూరు కార్పొరేషన్ లోని జూజూవాడీ సిప్‌కాట్ బేస్‌ల్లో జాతీయ రహదారి ఫ్లైఓవర్ పనులు కొనసాగుతున్నందున్న ప్రస్తుతం సెలవుల కారణంగా సిప్‌కాట్ ప్రాంతంల్లో కిల్లోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది, దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు, దీపావళీ పండుగ కోసం కర్ణాటక రాష్ట్రం నుంచి మరొక్కరు అటు రాష్ట్రాల నుంచి తమిళనాడుకు -చెన్నై జాతీయ రహదారిపైనే దీపావళీ పండుగ రోజున వేల సంఖ్యల్లో వాహనాలు వెళ్తున్నాయి. బస్సులు, ద్విచక్ర వాహనాలు వంటి అనేక వాహనాల్లో ప్రయాణిస్తుండటంతో ఆ ప్రాంతంల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది, జాతీయ రహదారిపై వాహనాలు వెళ్లడంతో ప్యాక్టరీలకు వెళ్లే కార్మికులు అసౌకర్యానికి గురయ్యారు. అత్తిపల్లి రాష్ట్ర సరిహద్దు ప్రాంతం నుంచి హోసూరు వరకు కిల్లోమీటర్ల మేర భారీ వాహనాలు, కార్లు, జీపులు, ద్విచక్ర వాహనాలు రోడ్డుకు ఇరువైపులా ఉన్నాయి. ప్రజలు ఇబ్బందులు పాలైయ్యారు.



బళ్లారి జైలు నుంచి దర్శన్ విడుదల

బళ్లారి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రేణుకాస్వామి హత్య కేసులో ఏ-2 నిందితుగా ఉంటూ బళ్లారి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న కన్నడ హీరో దర్శన్ బుధవారం బెయిల్‌పై విడుదలయ్యారు. బెయిల్ పత్రాలను సాయంత్రం 5 గంటలకు న్యాయవాది జైలర్‌కు అందజేశారు. పరిశీలించిన ఆయన దర్శన్‌ను విడుదల చేశారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారని ఆయన తరపు న్యాయవాదులు వేసిన పిటిషన్‌పై షరతులతో కూడిన బెయిల్‌ను న్యాయాధికారి మంజూరు చేశారు. ఆగస్టు నెల 29న బళ్లారి జైలుకు దర్శన్‌ను తీసుకొచ్చారు. సుమారు 60 రోజుల పాటు బళ్లారి జైల్లో దర్శన్ నిందితుడగా హై సెక్యూరిటీ సెల్‌లో ఉన్నారు. ఆయన కోసం ఆయన భార్య, తల్లి , సోదరులు, బావ మరిది అనేక సార్లు వచ్చారు. దర్శన్ విడుదల సందర్భంగా ఆయన భార్య జైలు వద్దకు వచ్చారు. జైలు నుంచి బయటకు రాగానే భార్యను కౌగిలించుకుని దర్శన్ భావోద్వేగానికి గురై కన్నీరు మున్నీరయ్యారు. పోలీసుల బందోబస్తు నడుమ బయటకు వచ్చిన ఆయన కారు ఎక్కి బెంగళూరు వైపు తరలి వెళ్లారు. ఆయనను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. వారిని కంట్రోల్ చేయడానికి పోలీసులు నానా తంటాలు పడ్డారు.


బళ్లారి జైలు నుంచి బయటకు వస్తున్న దర్శన్


కిశోర్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సభాపతి హొరట్టి తదితరులు

ఎమ్మెల్సీగా కిశోర్‌కుమార్ పుత్తూరు ప్రమాణ స్వీకారం

బెంగళూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల స్థానిక సంస్థల కోటాలో విధానపరిషత్‌కు భారీ మెజారిటీతో విజయం సాధించిన కిశోర్‌కుమార్ పుత్తూరు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. విధానసౌధలోని సభాపతి బసవరాజ్‌హొరట్టి ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో కిశోర్‌కుమార్ భగవంతుడు, భరతమాతల పేరుతో ప్రమాణ స్వీకారం చేశారు. పరిషత్ కార్యదర్శి కే ఆర్ మహాలక్ష్మితో పాటు బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భాగస్వామ్యులయ్యారు. ఇదే సందర్భంగా నగర పరిధికి చెందిన సవితా సమాజ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీ కిశోర్‌కుమార్ పుత్తూరును ప్రత్యేకంగా సత్కరించారు. విధానపరిషత్ సభ్యుడి హోదాలో మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయంలో మాజీ సీఎం సదానందగౌడతో పాటు పలువురు పార్టీ ముఖ్యులు సన్మానం చేశారు.

ముందే దీపావళి..!


తల్లిదండ్రులతో మౌనీష్

విడపనకల్లుకు చెందిన మౌనిష్.. డాక్టరయ్యాడు. బళ్లారి జిల్లా కుడితిని ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం విధుల్లో చేరాడు. 'ఇందులో విశేషం ఏముంది..? చాలామంది డాక్టర్లు అవుతున్నారు. రోగులకు సేవలు అందిస్తున్నారు..' అనుకుంటున్నారా..? విశేషం ఉంది. రెండు తరాల క్రితం వీరిది భూస్వామ్య కుటుంబం. మౌనిష్ తాత బండి అంజినయ్య విడపనకల్లులోఓ ప్రభుత్వ వైద్యశాల నిర్మాణానికి రెండు ఎకరాల భూమిని దానం చేశారు. దీని విలువ ప్రస్తుతం రూ.5 కోట్లకు పైగా ఉంటుంది. అంజినయ్యకు ఇద్దరు కుమారులు.. పాపారాయుడు, క్రిష్ణమూర్తి. వీరిని 'మాడీ ఇంటి అంజినయ్య' కుటుంబం అని పిలుస్తుంటారు. వ్యవసాయ సంక్షోభం వీరిని వెంటాడింది. పంటలు సరిగా పండక అప్పులు పెరిగిపోయాయి. వాటిని తీర్చేందుకు ఆస్తులను ఒక్కొక్కటిగా అమ్మేశారు. ఈ క్రమంలో మాడీ ఇల్లు, 20 ఎకరాల చీనీ తోట కరిగిపోయాయి.

సోదరులు ఇద్దరూ ఊరు విడిచి.. బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లుకు వలస వెళ్లారు. అక్కడ పొలాలను కౌలుకు తీసుకుని మిర్చి పంటను సాగు చేస్తూ కాలం గడిపారు. కొన్నాళ్ల తరువాత విడపనకల్లుకు తిరిగి వచ్చేశారు. శివారు ప్రాంతంలో భోజనం హోటల్‌ను ప్రాంభించారు. అన్నదమ్ములిద్దరికీ ఇద్దరిద్దరు కొడుకులు. కష్టపడి చదివిస్తున్నారు. పాపారాయుడు, పుష్పావతి దంపతుల కుమారుడే మౌనిష్.! పదో తరగతి వరకూ విడపనకల్లు ఆదర్శ పాఠశాలలో, ఇంటర్ బళ్లారిలో పూర్తి చేశాడు. ఆ తరువాత సోదరులిద్దరూ మౌనిష్‌ను ఫిలిప్పైన్స్‌కు పంపించి ఎంబీబీఎస్‌లో చేర్పించారు. అతని చదువు కోసం మిగిలిన భూమిలో కొంత అమ్మేశారు. ఆ కుటుంబం పెట్టుకున్న ఆశలను మౌనిష్ వమ్ము కానివ్వలేదు. ఎంబీబీఎస్ పూర్తి చేసివచ్చి.. డాక్టర్‌గా ప్రభుత్వ వైద్యశాలలో విధుల్లో చేరాడు. ఇన్నాళ్లూ పడ్డ కష్టానికి ఫలితం దక్కడంతో ఆ కుటుంబంలో ఆనందం నిండింది. ఒక్క రోజు ముందే దీపావళి వెలుగులు వారి ముఖాల్లో కనిపించాయి. **- విడపనకల్లు, ఆంధ్రజ్యోతి**

వీరప్పమొయిలీకి కన్నడ రాజ్యోత్సవ పురస్కారం

బెంగళూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి వీరప్పమొయిలీకి సాహిత్య రంగంలో కన్నడ రాజ్యోత్సవ పురస్కారాన్ని ప్రకటించారు. 69వ కన్నడ రాజ్యోత్సవ సందర్భంగా బుధవారం 69మందికి పురస్కారాలను అంజేయనున్నారు. జానపద రంగంలో ఇమాంసాబ్ వల్లెపనవర్ - ధారవాడ, అశ్వా రామణ్ణ - బళ్ళారి, కుమారయ్య - హాసన్, వీరభద్రయ్య - చిక్కబళ్ళాపుర, నరసింహాలు (అంధకళాకారుడు) - బీదర్, బసవరాజ సంగప్పహరివాల్ - విజయపుర, లక్ష్మిదేవమ్మ - చిక్కమగళూరు, పిచ్చళ్ళి శ్రీనివాస్ - కోలారు, లోకయ్యశేర - దక్షిణకన్నడ, చలనచిత్ర రంగంలో బెంగళూరుకు చెందిన హేమాచౌదరి, నరసింహమూర్తులు, సంగీతంలో రాజగోపాల్ - మండ్య, ఏఎస్ సదాశివ్ప - రాయచూరు, నృత్య రంగంలో విదూషి లలితారావ్ - మైసూరు, పాలనావ్యవహారాలలో ఎస్‌వి రంగనాథ్ - బెంగళూరు నగర, వైద్యరంగంలో జి.బి.బిడనహాళ - గదగ, మైసూరు సత్యనారాయణ - మైసూరు, డాక్టర్ లక్ష్మణహనుమప్ప బిదరి - విజయపురలు ఉన్నారు. సమాజసేవలో వీరసంగయ్య - విజయనగర, హిరాచందర్ వాగ్మరె - బీదర్, మల్లమ్మ సూలగత్తి - రాయచూరు, దిలీప్‌కుమార్ - చిత్రదుర్గ ఉన్నారు. ఇతరరంగాలలో హాలికల్ నటరాజ - తుమకూరు, డాక్టర్ హెచ్‌ఆర్ స్వామి - చిత్రదుర్గ, ఆన ప్రహ్లాదరావు - కోలారు, అజిత్‌కుమార్ రై - బెంగళూరు, ఇర్ఫాన్ రజాక్ - బెంగళూరు, విరూపాక్షప్ప రామచంద్ర - హావనూరు, విదేశీ, ఇతర రాష్ట్రాల సేవలు - కన్నయ్యనాయుడు (తుంగభద్ర గేట్‌ల నిర్వాహకుడు), తుంబె మొహియిద్దీన్ తుంబె గ్రూప్ యుఎఇ, చంద్రశేఖర్ నాయక్ - అమెరికా, పర్యావరణ రంగంలో అల్మిత్ర పటేల్ - బెంగళూరు, వ్యవసాయ రంగంలో శివనపుర రమేశ్ - బెంగళూరు గ్రామీణ, పుట్టీరమ్మ - చామరాజనగర, మీడియా రంగంలో ఎస్‌ఎస్ శంకర్ - దావణగెరె, సనత్‌కుమార్ బెళగళి - బాగల్కోటె, ఏజె కారటగి - కొప్పళ, రామకృష్ణ బడకేశి - కలబురగి ఉన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో బెంగళూరుకు చెందిన టివి రామచంద్ర, సుబ్బయ్య అరుణన్, సహకార రంగంలో విరూపాక్షప్ప నేకార - బళ్ళారి, యక్షగానంలో కేశవహెగ్డే - ఉత్తరకన్నడ, సీతారాం తొళ్పాడి - దక్షిణకన్నడ, బైలాట రంగంలో సిద్దప్ప కరియప్ప - బాగల్కోటె, నారాయణప్ప శిల్లేక్యాతి - విజయనగర, రంగస్థలం విభాగంలో సరస్వతి జులైకా బేగం - యాదగిరి, ఓబలేశ్ హెచ్‌వి - చిత్రదుర్గ, భాగ్యశ్రీ రవి - కోలారు, రాము - మైసూరు, జనార్ధన - మైసూరు, హనుమానదాస పవార - బాగల్కోటె, సాహిత్యరంగంలో బీటీ లలితానాయక్ - చిక్కమగళూరు, వీరప్పమొయిలీ - ఉడుపి, అల్లమప్రభు బెట్టదూరు - కొప్పళ, హనుమంతరావు దొడ్డమనె - కలబురగి, బాలాసాహెబ్ లోకాపుర - బెళగావి, బైలమంగల రామేగౌడ - రామనగర, ప్రశాంత్ మాడ్తా - దక్షిణకన్నడలతో పాటు విద్యారంగం నుంచి కమలమ్మ - బెంగళూరు నగర, రాజేంద్రశెట్టి - దక్షిణకన్నడ, పద్మాశేఖర్ - కొడగు ఉన్నారు. క్రీడారంగంలో జూడ్ ఫెలిక్స్ సెబాస్టియన్ - బెంగళూరు నగర, గౌతమ్‌వర్మ - రామనగర, ఉమాదేవి (బిలియార్డ్స్) - బెంగళూరు, న్యాయరంగంలో బాలన్ - కోలారు, శిల్పకళల రంగంలో బసవరాజ్ బడిగేరి - బెంగళూరు, అరుణ్ యోగిరాజ్ (అయోధ్య రామ్‌లల్లా విగ్రహ రూపకర్త) మైసూరు, చిత్రకళలో ప్రభుహరసూరు - తుమకూరు, చంద్రశేఖర సిరివంతె - శివమొగ్గ ఉన్నారు. కాగా శుక్రవారం కన్నడ రాజ్యోత్సవ పురస్కారాలను సీఎం సిద్దరామయ్య ప్రదానం చేయనున్నారు.